# ప్రతి బింబాలు

ఉల్లి పువ్వు ఛాయ సూరీడు కనిపించే వేళకి ఆ ఊరి ఆడాళ్ళు నోట్లో 'పందుంబుల్ల' పెట్టుకుని చంకన బిందె, నెత్తిమీద బిందెలు దొంతర్లుగా పెట్టుకుని కోనేటికి పోవటం జరుగుతుంది. ఆ సమయంలో మగాళ్ళు పొలం పనులుకి బయలుదేరుతుంటారు. సోమయాజులుగారు అంటే ఆ ఊరి పురోహితులు కోనేటికెళ్ళి స్నానం చేసుకుని సంధ్యావార్చుకుని తిన్నగా రామాలయానికి వెళ్తారు.

అలాటి ఓ సూర్యోదయాన-

ఎప్పటిలాగకాక ఆరోజు జనం మాత్రం గొప్ప హడావుడిగా ఉన్నారు. సందడిగా ఉన్నారు. సంబరంగానూ ఉన్నారు. ముత్తైదువులు సూర్యునికంటె ముందుగా లేచి, కాలకృత్యాలు తీర్చుకున్నారు. తలంటుపోసుకున్నారు. ముఖం నిండా పసుపు రాసుకున్నారు. నుదుట కుంకుమ దిద్దుకున్నారు. అందరి చేతుల్లోనూ మెరసిపోతున్న ఇత్తడి పళ్ళాలు, అందులో గన్నేరుపూలో, మందారపూలో, గులాబీలో - ఎవరికి అందుబాటులో ఉన్నపూలు, అరటిపళ్ళు, స్తోమతనుబట్టి కొబ్బరికాయలు, ఆవునెయ్యి కుందుల్లో వేసుకుని ఆలయానికి చేరుకుంటున్నారు.

అప్పటికప్పుడే ఊరి పురోహితులు, కరణం కామశాస్త్రి గారూ, మునసబు ముకుందరావు గారూ, కొత్త ప్రసిడెంటు కోటేశ్వర్రావుగ్గారూ, పీరుసాయిబూ, డేవిడ్ రాజూలాటిగ్రామపెద్దలూ, ఇంకా పలకా బలపం పట్టబోయే వయసులో ఉన్న పిల్లలూ రామాలయానికి చేరుకున్నారు.

వీళ్ళందరికంటే ముందే-

అక్కడికి చేరుకుంది రాముడమ్మ తుడిచిన ఆలయాన్నే ఎన్నోసార్లు తుడిచి, అలంకరించిన ఫోటోనే మళ్ళీ అలంకరించి దేవుడి గుడి చుట్టూ వేలాడగట్టిన రంగు తోరణాలు చూసి - ఆలయానికి కొత్తగా వేసిన సున్నపు వాసనలను పీలుస్తూ, వచ్చే జనాన్ని ఊహించుకుంటూ, తన్మయత్వంతో ఊగిసలాడి పోతోంది రాముడమ్మ.

ఆరోజు శ్రీరామనవమి. ఆరోజంటే రాముడమ్మ కెంతో ఇష్టం. ఆ రోజు రాముడితో మాట్లాడినట్టే భావిస్తుందామె. రాముణ్ణి సీతమ్మతో సహా ముచ్చటగా అలంకరించి మురిసిపోతుంది. అలాటిది అంతకంటే. ప్రత్యేకతేమంటే - రాముడమ్మ ఈరోజు రామకోటిని పూర్తిచేసింది.

ఇంకా నవమికి నెలరోజులు ముందుగానే రాముడమ్మ పెద్దలందరినీ సమావేశపరచింది. "ఈ సంవత్సరం నారామ కోటి పూర్తయిపోతుంది. నవరాత్రుళ్ళు ఘనంగా జరపాలి. నవమినాడు 'ఏకాహం' చెయ్యాలి. మీరందరూ నాకు చేయూత నిస్తే చాలు. ఖర్చంతా నేనే పెట్టేకుంటాను." అంది.

"అదేంటి రాముడమ్మా! ఖర్చంతా నువ్వేలా పెట్టుకుంటావు? మమ్మల్నిపరాయివాళ్ళను చేస్తున్నావా? అదేం వీల్లేదు. నువ్వు రామకోటిని పూర్తిచేసావు. అక్కడితో పనిఅయ్యింది. ఇంక

ఏం చేయాలో, ఎలా చెయ్యాలో అన్నది మాకొదిలెయ్యి "అన్నారు మునసబుగారు. అందరూ అలాగే అన్నారు. రాముడమ్మంటే ఆ ఊళ్లో అంతగౌరవం, అభిమానం, అంత అప్యాయం, ఆదరణ. అంతమందినీ తనమాట మంచితనంతోనే ఆకట్టుకోగలిగిందామె.

రాముడమ్మది ఆఊరేకాదు. చాలాకాలం క్రితం రాముడమ్మ అయినవాళ్ళందరూ అసహ్యించుకుని, పోపొమ్మని ఇంటినుండి తగిలేస్తే, చిన్నట్రంకు పెట్టెతో కదిలిపోతున్నరైలు పెట్టి ఎక్కేసింది రైలుబండి చాలాదూరం వెళ్ళాక టిక్కెట్ కలెక్టర్ టికెట్ అడిగితే కళ్ళనిండా నీరునింపుకుంది. దాంతో అతని మనసు ఆర్ధమయింది. "నువ్వేదో అభాగ్యురాలిలా ఉన్నావు. తరువాత స్టేషనులో నేను దిగిపోతాను. టి.టి.మారుతారు. గుర్తు చెయ్యి ఆ వచ్చే ఆయనికి చెప్తాను" అన్నాడు. అయితే కునుకుపట్టడంతో ఆమె అతన్ని కలువలేకపోయింది. తరువాత స్టేషన్లో టి.టి ఆమె విషయమంతా తెలుసుకుని - "ఇక్కడ దిగిపొండి పైన స్క్వాడ్ వుంది", అనగానే పెట్టెతో దిగిపోయింది. పట్టాలు దాటితే కాలిబాట కనిపించింది. నడుచుకుంటూ చాలా దూరం వెళ్ళింది.

"ఎక్కడికెళ్ళాలి? ఏం చేయాలి? ఎలాబ్రతకాలి? అన్నీ ప్రశ్నలే!

కడుపులో ఆకలి! పేగులు శివరంజని ఆలపిస్తున్నాయి.

సూర్యుడు - అసలే గ్రీష్మమేమో పేట్రేగిపోతున్నాడు. నేల నిప్పులు పరచినట్లుంది. కాళ్లుపొక్కులెక్కుతున్నాయి. గొంతుతడారిపోతుంది. అడుగులు పడటం కష్టంగా ఉంది. కాసేపటికి తనేమయ్యిందో తనకే తెలీదు. కానీ సాయంకాలానికి మాత్రం ఓ పల్లెలో ఉంది. చుట్టూరా జనందడికట్టి ఉన్నారు. ఉపచారాలు చేస్తున్నారు. ఒకామె తడిగుడ్డతో రాముడమ్మ ముఖం తుడుస్తోంది. మెల్లగా విచుకున్న కనురెప్పల మధ్యకనిపిస్తోన్న జనప్రవాహం, తనని ఓస్త్రీ కూర్చోపెట్టి పాలగ్లాసు నోటికందించింది. పాలుత్రాగేసి రెప్పవాల్చేసింది. తెల్లారికోడికూతకు లేచింది. ఏం అర్థం కాలేదు. ప్రక్కనే వేపచెట్టుకనిపించింది. పుల్లవిరిచి పళ్ళుతోముకుంది. వాకిట్లో ఉన్న సిలవరిబిందెను పట్టుకుని నూతికెళ్ళి నీళ్ళుతోడి తెచ్చింది. కళ్లాపిజల్లి ముగ్గు పెట్టింది. తిన్నగా ఉన్న ముంజూరు దగ్గర డబ్బాలో ముగ్గు కనిపిస్తే తెచ్చి ముగ్గుపెట్టింది. జారుతున్న కొంగును మొలలో దోపుకుని నిల్చుంది.

రాముడమ్మనే పరీక్షగా చూస్తోన్న ముకుందరావును చూసిదణ్ణం పెట్టింది. "చూడమ్మా' ' నిన్నదారిలో తెలివిలేకుండా పడి ఉంటే పిల్లలు చెప్పారు. నిన్ను చూస్తే పెద్దింటి పిల్లలాగన్నావు. నీ ఆకారం చూస్తే భగవంతుడు నీకు చిన్నతనంలో ఇంత అన్యాయం చేసినందుకు మాకు బాధగా ఉంది నువ్వెవరివమ్మా!"

తండ్రి లాంటి ముకుందరావుని చూస్తూ కన్నీటితో చెప్పింది.

'అయ్యా! నేనో అనాథను నాకెవ్వరూ లేరు. తాళికట్టిన మొదటి ఘడియల్లోనే నా భర్త ధనుర్వాతంతో పోయాడు. భర్తను నేనే పొట్టన పెట్టుకున్నానని అత్తగారూ, మామగారూ తగిలేసారు. ముదనష్టపు జాతకురాలినని కన్నవాళ్ళూ తిట్టారు. కొట్టారు. కొన్నాళ్ళు భరించాను.

చచ్చిపోవాలనిపించింది. ఎందరో - ఏ జన్మలో చేసిన పాపమో -దాన్ని అనుభవించాలి!" అనిపించింది. అయిన వాళ్ళందరూ అసహ్యించుకుంటే అక్కడుండలేక కదులుతోన్న బండెక్కేసాను. టిక్కెట్ లేదని మధ్యలో దింపేసారు. దిగిపోయాను. ఈ ఊరి కాలిబాట కనిపిస్తే వచ్చాను. ఎంత వరకూ వచ్చానో నాకు తెలీదు. నన్నిక్కడికి ఎవరు తీసుకు వచ్చారో తెలీదు. ఇదీ! నాన్న గారూ! నా కథ నాకు తలదాచుకోటానికింత చోటివ్వండి. నన్నో బిడ్డలా చూసుకోండి. మీ ఎవరికీ ఎదురురాను" , అంది కన్నీటిని తుడుచుకుంటూ,

ఆమో మాటలు ముకుందరావు మనసును కరిగించాయి. "తల్లీ ! నీ కథతో నాగుండె తరుక్కుపోయింది. ఈ ఊరి వాళ్ళుమంచివారు. ఇక్కడ నీకెలాంటి భయం లేదు. నువ్వు ఈ ఊర్లో ధైర్యంగా ఉండు. నీకన్ని సదుపాయాలూ చేస్తాం" అన్నాడు.

ఆ తరువాత పంచాయితీ ఏర్పాటు చేసారు. ముకుందరావు గారు ఊరి పెద్దల సమక్షంలో రాముడమ్మ విషయం చెప్పారు. అందరి మనసులూ కరిగి పోయాయి.

'నేనిల్లు యిస్తానని ఒకరంటే, నేను నెలకు సరిపడా బియ్యం యిస్తానని' యిలా అందరూ రాముడమ్మను ఆదుకున్నారు. అలాగ రాముడమ్మ ఊరి మనిషయ్యింది. మంచి తనంతో అందరికీ చుట్టమైంది.

సూర్యోదయానికి ముందే లేచి, స్నానం చేసి తులసి పూజ చేసేది. ఆ తరువాత రామకోటి రాసేది. ఎవరింట ఏ శుభకార్యం జరిగినా పనులన్నీ రాముడమ్మే చూసుకొనేది. ఇంతమంది మనుషులైతే.ఇన్నిబియ్యం. ఇన్నికూరలు. ఇన్ని పాలు ఉండాలి. ఇదీ పద్ధతి" అని చీటీ రాసిచ్చేది. ఏ వస్తువూదుబారా కాకుండా చూసుకునేది ఊర్లో ఎక్కువ పెళ్ళిళ్ళు, వ్రతాలు జరిగితే వాళ్ళింట కొంతసేపు వీళ్ళింటకొంత సేపు గడిపి, అన్నీ దగ్గరుండి పురమాయించేది. విసుగు చెందేది. కాదు.

నువ్వు కూర్చోమ్మా అని అంటే కూర్చుంటే పన్లెలా అవుతాయి?అని కసురుకునేది. రాముడమ్మ అడుగుపెడితే తమకంతా శుభమే అనే వారు అక్కడి జనం పండగల్లో పెళ్ళిళ్ళలో అందరి సహపంక్తిని కూర్చుండేది మొదట్లో అందరూ వారించే వారు "ఈ మట్టి అందరిదీనా? ఇక్కడ పుట్టిన వాళ్ళం ఇక్కడే కలిసేవాళ్ళం ఈ భూమి మీద నుండి వచ్చేపంట నీరూ; అదే, వంటచేసే నిప్పు ఒకటే తినే నోరూ అందరికీ సమానమే కొంచం దూరంగా ఆలోచిస్తే మనందరీ తండ్రీ ఆ దేవుడే. తినండి మాట్లాడకుండా " అనేది.

ఆమె వేదాంతానికి, తత్వానికి అందరూ ఆశ్చర్యపోయేవారు. అక్కణ్ణుంచీ ఆమె చెప్పకుండా ఏ పనీ చేసే వారుకాదు. అలా ఆ మనుషుల్లో ఒకరైంది.

ఆమెలో ఏం గొప్ప తనమో-

చిన్న పిల్లలు గుక్క తిప్పుకోకుండా ఏడిస్తే ఆమె ఎత్తుకుంటే ఊరు కొనే వారు. ఆమె చేత్తో తినిపిస్తే పిల్లలు మారాం చేయకుండా తినేసేవారు. ఎవరి పిల్లలకు ఏం వచ్చినా " అమ్మా!

రాముడమ్మా! పిల్లాడు చూడమ్మా ఏంటో అయిపోతున్నాడు" అంటే-

"ఆ... ఇలా ఇవ్వండి! అని లోలో..లాలీ" ...అని అటూ, ఇటూ, తిప్పేది. అంతే పిల్లాడు ఆడుకునేవాడు.

"తల్లీ! రాముడమ్మా, నీచేతి మహత్యమేమిటో గానీ, నీదగ్గర కొస్తే పిల్లలు నవ్వే బొమ్మలైపోతారు". అనేవారందరూ.

ఎన్ని పనులున్నా సాయంకాలం అయ్యేసరికి పిల్లలు ఆమె చుట్టూ పోగయ్యేవారు. ఆమె కథలు చెప్పేది. పొడుపు కథలు చెప్పేది. లాలి పాటలు నేర్పేది. రామాయణ, భారత భాగవతాలు పాటలుగా పాడించేది. ఎక్కాలు చెప్పేది.

రాముడమ్మ ఈ పని చెయ్యొద్దంటే ఆ పనిని ఎవ్వరూ చేసేవారు కాదు. ఓ సారి కోటేశ్వర్రావు సర్పంచ్ గా నిలబడ్డాడు. అతనికి పోటీగా ఓ అనామకుడు నిలబడ్డాడు.

రాముడమ్మని పిలిచి - "అమ్మా! నువ్వే అందరికీ చెప్పాలి నన్ను గెలిపించమని. నీ మాటెవరూ కాదనరని నానమ్మకం" అన్నాడు. కోటేశ్వర్రావు.

రాముడమ్మ అతన్ని ఎగాదిగా చూసి " అన్నా, నా మాట వింటావ్?" అంది.

"ఏమిటో?" అన్నాడు.

" నాకెందుకో ఈ సారి నువ్వు తగ్గపోటంమంచిదిగా తోస్తున్నది" అంది. అప్పుడా మాటల్ని అంతసీరియస్‌గా తీసుకోలేదెవరూ. కానీ, ఎన్నికల్లో కోటేశ్వర్రావు ఓటమి పాలయినపుడు అందరికీ రాముడమ్మ మాట మీద గురికుదిరించి. అక్కణ్ణుంచీ అందరికీ ఆమె మాటంటే గురి. ఆమె నడిగే చేసే వారే పనైనా.

రాముడమ్మ ఆ ఊళ్ళో అడుగుపెట్టాక ఏ పండుగ వచ్చినా అందరూ కలిసి చేసుకోవాలన్న రివాజు పెట్టింది.

ఓ సారి పీరు సాయిబు ఇల్లు కొత్త పెళ్ళి కూతురులా వెలిగి పోతోంది.

"ఏంటన్నా! ఏమైనా విశేషమా ఇవాళ?" అంది ఆవైపు వెళ్ళిన రాముడమ్మ.

" మాకీ హీ వాళ పండ్గ" అన్నాడు పీరు సాహెబ్,

"అదేంటికి పండుగ నువ్వొక్కడివే చేసుకుంటే ఏం సరదాగా ఉంటుంది? అందరినీ పిలవ్వా" అంది.

పీరు సాహెబ్ రాముడమ్మని ఆశ్చర్యంగా చూస్తూ "మేం సాయి బోల్లం, మాది దేవుడూ మీకు నప్పదు కదా?" అన్నాడు. అన్నపుడు ఊళ్ళో ఒంటరిగా అతడు అనుభవిస్తోన్న వేదన ఆమె కర్థం అయింది.

" తప్పన్నా! దేవుడు మనందరికన్నా గొప్పవాడు నువ్వు సాయిబువు, నేను హిందూని,

డేవిడ్ క్రైస్తవుడు. మనం చెప్పుకుంటేనే తెలిసేది. దేవుళ్ళూ అంతే. మనం ఏ పేరుతో పిలిస్తే ఆ పేరుతోనే పలుకుతారు. తల్లినిమేము అమ్మా అంటాం. నువ్వింకోలా అంటావ్. అర్థం ఒకటే.'' అంది.

ఆ తరువాత అందర్నీ ఒప్పించింది. ఆ ఒప్పించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. అన్నా! మీకు చెప్పేపాటిదాన్ని కాను. కానీ నామాట ఒకటి వినండి. ఎన్నికలు జరుగుతున్నాయి. సాయి బన్న ఓటు కూడా అడుగుతున్నాం. పిల్లలికి రక్షలు కట్టిస్తున్నాం. సాయిబన్న మంత్రించి యిస్తున్నాడు. మనం మానేస్తున్నామా? అలాంటప్పుడతని దేవుడు మన దేవుడు కాడా? అతని ఆనందం మన ఆనందంకాదా?'' అంది.

ఆలోచించారు అందరూతలలూపేరు అప్పట్నించి అన్ని పండుగలూ కలిసే చేసుకునేవారు.

రాముడమ్మ మామూలు మనిషి కాదు. తమ ఊరిని బాగుచెయ్యడానికి వచ్చిన దేవత! అనుకునేవారందరూ.

అందుకే -

ఈ రోజురాముడమ్మ రామకోటి పూర్తిచేసి ఏకాహం చేస్తోంటే పీరుసాయిబు, డేవిడ్ రాజు వాళ్ళకుటుంబాలు ఎంతో భక్తి శ్రద్ధలతోపూజాకార్యక్రమంలో పాల్గొన్నారు.

మంగళవాద్యాలు మార్మోగుతాన్నాయి.

సీతారాముల కళ్యాణోత్సవం వైభవంగా ముగిసంది. చుట్టుప్రక్కల పదిగ్రామాలజనం అన్న సంతర్పణకు వచ్చి కలిసి భోంచేసారు. రాముడమ్మ కళ్ళలో వెలుగుపూవులే పూసాయి. రాముడమ్మ మంచి కాంతితో కనిపించింది అందరికీ ఆరడుగుల ఇత్తడి దేవుడు చెట్టు బంగారం లామెరిసిపోతోంది. దాని ఆకుల్లోనే నేతిలో ముంచి వెలిగించిన వత్తులు నక్షత్రాల్లా వెలిగిపోయిన్నాయి. దేవుని దగ్గర పెద్దకుందులో దీపం చుక్కల మధ్యన చంద్రునిలా ప్రకాశిస్తోంది. తెల్లవార్లు భజన జరుగుతూనే ఉంది.

ఎవరూ కదల్లేదు. తెల్లారు ఝామును భజనతారాస్థాయికి చేరింది. మేళ తాళాలమ్రోతలూ, మద్దెల వాద్యాలు మిన్నుమిట్టాయి. హార్మోనియం సంగీతం ఆనందాన్ని కలిగిస్తోంది. అందరి గొంతూ ఒకటై రామనామస్మరణ చేస్తోంది. రాముడమ్మ ఊగిపోతోంది. అందరి మనసులూ, అందరి నోళ్ళూ 'రామ' మయమే.

అంతలో-

ఓ గాలి కెరటం రివ్వున వచ్చింది. పెద్దకుందులో దీపం ఘనమైపోయింది. సరిగ్గా - అప్పుడే రాముడమ్మ నేలకొరిగిపోయింది. అందరూ భజనలో లీనమైపోవటం వలన ఎవరూ పట్టించుకోలేదు. 'అయ్యో! దీపం ఘనమైపోయిందే?' అనిసోమయాజులు గారు లేచారు.

"ఆ........ఆ.......... రాముడమ్మ రాముడమ్మ గట్టిగా అరిచారు. ఆయన.

ఇంకేముంది?

భవంతులుకూలు తున్నట్టు జనం ఒకటే గోల

పిల్లలూ, పెద్దలూ, ఆడాళ్ళూ మగాళ్ళూ ఆక్రందనలూ ఏడుపులు, నెత్తిమొత్తుకోడాలు!

అందరి ముఖాలు మబ్బుల ఆకాశం అయింది.

రాముడమ్మ కథ అలా ముగిసిపోయింది!

కొన్నాళ్ళ వరకూ ఎవరూ తేరుకోలేక పోయారు. "ఆమె దేవత! మనందర్నీ ఒకటి చేసింది' అన్నారు దుఃఖం నిండిన గొంతుతో.

'హావును, హామెది అచ్ఛాదిల్, హామెలో అల్లా కనిపిస్తాడు.' అన్నాడు సాయిబు.

"ఆమె మేరీమాత" అన్నాడు డేవిడ్.

"ఆమె వ్యక్తి కాదు, అద్భుతశక్తి" అనుకున్నారందరూ పరోపకార పరాయణత్వం సత్యనిబద్ధత ఎవరిలో వుంటే వాళ్ళు దైవానికి ప్రతి బింబాలు. వాళ్ళే మనుషులను ప్రేమించగలరు.శాశించగలరు. గమ్యం చూపగలరు. ఆమె ఋణాన్ని, మనం ఎన్ని జన్మలకీ తీర్చుకోలేం!' అన్నరందరూ.

" హొక్కటే మార్గం" అన్నడు సాయిబు.

అందరూ అతన్నిచూసారు.

"హామె రాసిన రామకోటి 'భూమిలో' పెట్లో పెట్టి పాతి - దాన్మీద 'రాం-జీసస్-అల్లా! వొక్కటే అని కోవెల కట్టిద్దాం" హామెకోర్కెగా మన్మందరం కల్సిమెల్సిబ్రతుకుదాం" అన్నాడు.

అతని మాటలు అందరికీ నచ్చాయి.

అలాగే చేసారు!

ఇది జరిగి చాలా సంవత్సరాలు గడిచినా జనానికే కష్టం వచ్చినా! 'రాముడమ్మ'ని సేవిస్తారు. వాళ్ళనమ్మకమో, రాముడమ్మమహత్యమో తెలీదుగానీ వాళ్ళ కష్టాలు తొలుగుతాయి.

మంచీ మానవత్వమే దైవానికి ప్రతిబింబాలు అయితే రాముడమ్మ దేవతేమరి! కాదంటారా....!?

('శుభం' మాసపత్రిక నిర్వహించిన కథలపోటిలో ద్వితీయ బహుమతి పొంది మే 1998 'శుభం' లో ప్రచురింపబడినది.)

✽ ✽ ✽ ✽